# సాక్షి శ్రీకాకుళం

బుధవారం ; 3 ; మే ; 2023





## పీజీ ప్రవేశాలకు ఆహ్వానం

పోస్టు గ్రాడ్యుయేషన్ ప్రవేశాలకు వేళయ్యింది. పీజీ సెట్‌కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు.

- 8లో



## ఆర్ట్ బై కల్కి

చిత్ర కళలో కల్కి తనదైన ముద్ర వేశారు. అద్భుత కళాఖండాలు గీశారు.

- 8లో

**శ్రీకాకుళం జిల్లా ఉష్ణోగ్రతలు**

| మండలం | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| ఆమదాలవలస | $34^0$ | $23^0$ |
| ఇచ్ఛాపురం | $32^0$ | $22^0$ |
| పాతపట్నం | $32^0$ | $22^0$ |
| శ్రీకాకుళం | $33^0$ | $21^0$ |

## న్యూస్‌రీల్

### ప్రభుత్వ ఆస్పత్రుల పరిశీలన



బైదలాపురం పీహెచ్‌సీలో వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న పీఓ కల్పనా కుమారి

**పాతపట్నం:** ప్రభుత్వ ఆస్పత్రుల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని సీతంపేట ఐటీడీఏ పీఓ కల్పనా కుమారి వైద్యులను ఆదేశించారు. పాతపట్నం మండలంలోని బైదలాపురం, గంగువాడ పీహెచ్‌సీలను మంగళవారం పీఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ గిరిజన ప్రజలకు వైద్య సేవలు అందించాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండాలని, ఆస్పత్రుల్లో పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. గంగువాడ పీహెచ్‌సీలో ఆశ డే సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం గంగువాడ గ్రామ సచివాలయంలో రికార్డులను పీఓ పరిశీలించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### పారా బ్యాడ్మింటన్ క్రీడాకారిణికి ఆసరా



సాయికుమార్‌కు లక్ష రూపాయిల చెక్కును అందిస్తున్న రెడ్డీస్ కంపెనీ ప్రతినిధులు

**జి.సిగడాం:** పారా బ్యాడ్మింటన్ క్రీడాకారిణి జి.సిగడాం మండలం సంతవురిటి గ్రామానికి చెందిన పడాల రూపాదేవి అంతర్జాతీయ స్థాయిలో ఆడేందుకు సహకరిస్తామని పైడిభీమవరంలో ఉన్న డాక్టర్ రెడ్డీస్ ఫార్మా కంపెనీ హెచ్‌ఆర్ మేనేజర్ కేవీఎస్ఎన్ రాజు, జోగారావు అన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, రణస్థలం వైఎస్సార్ సీపీ నాయకులు లంకలపల్లి ప్రసాదరావు(సివిల్ ప్రసాద్) ఆధ్వర్యంలో కంపెనీ ప్రతినిధులతో ఇదివరకే మాట్లాడారు. ఆ మేరకు రూ.లక్ష చెక్కును సాయికుమార్‌కు అందజేశారు. ఈ డబ్బు రూపాదేవి కుటుంబానికి అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్య క్రమంలో రాష్ట్ర నగరాల కార్పొరేషన్ డైరెక్టర్ పిల్లా ఆనంద్‌పాత్రుడుతోపాటు సిబ్బంది ఉన్నారు.


### 'ప్రభుత్వ బడిలో చేర్పించండి'



కొత్తూరులో విద్యార్థి ఇంటికి వెళ్లి విద్యార్థి ప్రతిభను తెలుసుకుంటున్న డిప్యూటీ ఈఓ పగడాలమ్మ

**కొత్తూరు:** ప్రతి ఉపాధ్యాయుడు తన పరిధిలో ఉన్న బడిఈడు పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని టెక్కలి డివిజన్ ఉప విద్యాశాఖాధికారి పగడాలమ్మ సూచించారు. కొత్తూరులో మంగళవారం విద్యార్థుల ఇళ్లకు వెళ్లి వారి ప్రతిభను పరిశీలించారు. వేసవి సెలవుల్లో చిత్రలేఖనం, సంగీతం, ఆటపాటలతోపాటు పలు అంశాలపై ప్రతి రోజు సాధన చేయించాలన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలు, పథకాలు వంటివి వివరించాలన్నారు.

### మానవత్వం చాటుకున్న వలంటీర్



సోమేశ్వరికి ఆస్పత్రిలో పింఛన్ అందిస్తున్న వలంటీర్ మురళి

**సారవకోట:** మండలంలోని చిన్నగుజ్జువాడ పంచాయతీ వలంటీర్ రైవాడ మురళి తన మానవత్వాన్ని చాటుకున్నాడు. ఈ గ్రామానికి చెందిన అమర్తి సోమేశ్వరి ఇటీవల అనారోగ్యానికి గురై శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరారు. ఆమెకు పింఛన్ అందించడానికి మురళి శ్రీకాకుళం వరకు ప్రయాణం చేశాడు. మురళి అంధుడు కావడంతో వేరే వలంటీర్ బాడాన ధనుంజయ్ సాయం తీసుకుని శ్రీకాకుళంలోని ఆస్పత్రికి వెళ్లి సోమేశ్వరికి పింఛన్ అందించాడు. వలంటీర్‌ను స్థానికులు అభినందించారు.

## సిక్కోలు గ్రామీణానికి

# గుర్తింపు యోగం





- జాతీయ స్థాయి గుర్తింపునకు సిక్కోలు పర్యాటకం
- ఉత్తమ గ్రామీణ పర్యాటక అవార్డుల రేసులో నాలుగు గ్రామాలు
- జిల్లా అధికారుల ప్రతిపాదనలను పరిగణనలోకి తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం
- ప్రతిపాదిత జాబితాలో కూర్మ, పొందూరు, బుడితి, బెజ్జిపురం గ్రామాలు

**సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:** సిక్కోలు పల్లెలు జాతీయ స్థాయి గుర్తింపునకు నోచుకుంటున్నాయి. జాతీయ గ్రామీణ పర్యాటక అవార్డుల కోసం మన జిల్లాకు చెందిన నాలుగు గ్రామాలను రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసి కేంద్ర పర్యాటక శాఖకు నివేదించింది. వాస్తవంగా మూడు ఉత్తమ పర్యాటక గ్రామాలను ఎంపిక చేసి పంపాలని రాష్ట్ర ప్రభుత్వం తొలుత కోరినా... ఆ తర్వాత మరో గ్రామీణ పర్యాటక ప్రదేశాన్ని కూడా పరిగణనలోకి తీసుకుంది. రాష్ట్ర వ్యాప్తంగా జిల్లాల నుంచి వెళ్లిన ప్రతిపాదనల్లో అత్యధికంగా మన జిల్లాకు చెందినవే కేంద్ర పర్యాటక శాఖకు సిఫార్సు చేయడం గమనార్హం.

దేశ వ్యాప్తంగా గ్రామీణ పర్యాటక ప్రదేశాల కోసం అవార్డులు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగా మన జిల్లా నుంచి నాలుగు గ్రామీణ పర్యాటక ప్రదేశాలను ఎంపిక చేసి కేంద్రానికి సిఫార్సు చేశారు. గ్రామీణ పర్యాటక ప్రదేశాలను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో పాటు దేశ నలుమూలలా వీటి ఖ్యాతిని తెలియజేయాలన్న ఆలోచనలో భాగంగా కేంద్రం ఉత్తమ గ్రామీణ పర్యాటక ప్రదేశాలను ఎంపిక చేస్తోంది. మన జిల్లా నుంచి పొందూరు, బుడితి, కూర్మ, బెజ్జిపురం గ్రామాలను రాష్ట్ర ప్రభుత్వం సిఫార్సు చేసింది.

### కొత్త ఆకర్షణ.. కూర్మ గ్రామం

ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగానికి సుమారు ఆరు కిలోమీటర్లు దూరంలో హిరమండలంలో ఉన్న అతి చిన్న కుగ్రామంగా 2019లో ప్రపంచానికి పరిచయమైన కూర్మ గ్రామం ఇప్పుడు అందరి దృష్టిలో పడింది.

- రోజురోజుకి అక్కడి వెళ్తున్న పర్యాటకుల సంఖ్య పెరుగుతోంది. దానికి దగ్గరలోనే హిరమండలం రిజర్వాయర్, శ్రీముఖలింగం పుణ్యక్షేత్రం ఉండటంతో ఆ ప్రాంతానికి పర్యాటకుల తాకిడి ఎక్కువైంది.
- అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం సంస్థాన ఆచార్యులు భక్తి వేదాంతస్వామి ప్రభుపాదుల ఆదేశాలతో భక్తి వికాస్ స్వామి సారథ్యంలో 2018 జూలైలో కూర్మ గ్రామాన్ని నిర్మించారు.
- గ్రామంలో 56 మంది నివాసముంటున్నారు. 12 కుటుంబాలు, 16 మంది విద్యార్థులు, ఆరుగురు బ్రహ్మచారులు నివసిస్తున్న ఈ గ్రామం ఆధునిక పద్ధతులకు దూరంగా ఉంది. ఈ కారణంగానే అక్కడికి పర్యాటకుల సంఖ్య రోజురోజుకీ పెరుగుతోంది.
- అధికారిక లెక్కల ప్రకారం ఏటా కొత్తగా **35,891**మంది ఇక్కడికి వస్తున్నారు. ఇప్పుడీ గ్రామాన్ని జాతీయ ఉత్తమ గ్రామీణ పర్యాటక అవార్డుల కోసం ప్రభుత్వం సిఫార్సు చేసింది.

### బెజ్జిపురం మెరిసేలా..



బెజ్జిపురం గ్రామం



- జాతీయ గ్రామీణ పర్యాటక అవార్డుల కోసం బెజ్జిపురం గ్రామాన్ని కూడా రాష్ట్ర ప్రభుత్వం సిఫార్సు చేసింది.
- జ్యూట్ ఉత్పత్తులతో పాటు పక్కనే పొందూరు ఖాదీ పరిశ్రమ ఉండటంతో ఇక్కడికి కూడా పర్యాటకులు అధికంగానే వస్తున్నారు.
- ఏటా **55,822** మంది ఇక్కడికి విచ్చేస్తున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని బెజ్జిపురం గ్రామాన్ని కూడా జాతీయ గ్రామీణ పర్యాటక అవార్డుల సిఫార్సుల జాబితాలో చోటు కల్పించారు.



### సిక్కోలు కీర్తి.. పొందూరు ఖ్యాతి..



పొందూరు గ్రామం



- పొందూరు ఖాదీ అంటే ప్రత్యేకించి చెప్పనక్కర్లేదు. స్వాతంత్ర్య ఉద్యమం దగ్గరి నుంచి నేటి వరకు దానికున్న ప్రాధాన్యత ఎంత చెప్పినా తక్కువే. ఇక్కడికొచ్చే పర్యాటకుల సంఖ్య ఏటేటా బాగా పెరుగుతోంది.
- అధికారిక లెక్కల ప్రకారం ఏటా **2.25**లక్షల మంది సందర్శిస్తున్నారు. దేశ, విదేశాల నుంచి ప్రముఖ వ్యక్తులు వచ్చి పొందూరు ఖాదీని సందర్శించి కొనుగోలు చేస్తున్నారు.
- ఇక్కడ ఖాదీకి ప్రత్యేకతే కాదు డిమాండ్ కూడా ఎక్కువగా ఉంది. ఇటలీ, జర్మనీ, కెనడా, యూఎస్ఏ, నార్వే, థాయ్‌లాండ్ దేశాల నుంచి గ్రాడ్యుయేట్ ఫ్యాషన్ టెక్నాలజీ విద్యార్థులు, ప్రముఖులు సందర్శిస్తున్నారు. పంజాబ్, హైదరాబాద్, బెంగళూరు, చెన్నై వంటి నగరాల్లో ఫ్యాషన్ టెక్నాలజీ విద్యార్థులు వచ్చి ప్రాజెక్టులను తయారు చేశారు.
- ఖాదీ పరిశ్రమలో సరికొత్త పోకడలకు సంబంధించి నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫాషన్ టెక్నాలజీ(నిఫ్ట్), నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డిజైన్(ఎన్ఐడి) విద్యార్థులు పొందూరును సందర్శించారు.
- ఇక్కడ వస్త్ర నమూనాలను పరిశీలించి హైదరాబాద్, బెంగుళూరు, చెన్నై, భోపాల్, గాంధీనగర్, కన్నూర్, కోల్‌కతా, ముంబై, పుణే, కంగరా, భువనేశ్వర్‌లలో తమ విద్యార్థులకు డిజైనింగ్ తదితర ప్రక్రియల్లో శిక్షణ ఇస్తున్నారు.
- శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన తర్వాత హైదరాబాద్, బెంగళూరు, అహ్మదాబాద్, కోల్‌కతా తదితర చోట్ల నెలకొని ఉన్న వస్త్ర పరిశ్రమల యూనిట్లలో ఉద్యోగాలు పొందుతున్నారు. దేశ వ్యాప్తంగా వ్యాపారం సాగిస్తున్న ఖాదీ వస్త్రాల డిమాండ్‌తో పొందూరు పేరు మార్మోగుతోంది. ఇప్పుడీ గ్రామం గ్రామీణ ఉత్తమ పర్యాటక ప్రదేశంగా జాతీయ స్థాయిలో ఎంపిక అవుతుందన్న ఉద్దేశంతో మన ప్రభుత్వం సిఫార్సు చేసింది.

### బుడితి కంచు మోగేలా..





- 150 ఏళ్ల చరిత్ర గల బుడితి గ్రామం దేశవ్యాప్తంగా గుర్తింపు పొందే అవకాశం వచ్చింది.
- ఇత్తడి వస్తువుల తయారీలో పేరు గాంచిన బుడితి గ్రామానికి వచ్చే పర్యాటకుల సంఖ్య ఎక్కువగానే ఉంది.
- అధికారుల లెక్కల ప్రకారం ఏటా **25,456** మంది ఇక్కడికి వస్తున్నారు.
- జిల్లాలోని సారవకోట మండలం బుడితి గ్రామంలో తయారవుతున్న ఇత్తడి వస్తువులు నాణ్యతతో పాటు అందంలో కూడా ప్రసిద్ధిగాంచాయి.
- ఇక్కడ తయారయ్యే దేవతా విగ్రహాలకు రాష్ట్రంలోనే కాకుండా పక్క రాష్ట్రాల్లోనూ విశేష ఆదరణ లభిస్తోంది.
- 7వ తరగతి సాంఘిక శాస్త్రం పాఠ్య పుస్తకంలో బుడితి ప్రస్తావన ఉంది. లేపాక్షీ ఆర్డర్లపై వస్తువులు తయారీ వరకు బుడితి ఖ్యాతి చేరింది. అందుకనే గ్రామీణ ఉత్తమ పర్యాటక పోటీలకు బుడితి గ్రామాన్ని రాష్ట్ర ప్రభుత్వం సిఫార్సు చేసింది.

### 'హైవేపై భారీ వాహనాలకు అనుమతి లేదు'

**శ్రీకాకుళం క్రైమ్ :** సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బుధవారం విజయనగరం జిల్లా భోగాపురంలో పర్యటించనున్న నేపథ్యంలో.. ఉదయం ఏడు గంటల నుంచి పర్యటన ముగిసినంత వరకు జాతీయ రహదారి మార్గంలో విశాఖపట్నం వెళ్లే భారీ వాహనాలకు అనుమతిలేదని ఎస్పీ జీఆర్ రాధిక స్పష్టం చేశారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. భారీ వాహనదారులు జిల్లా పోలీసు శాఖ అమలుచేయనున్న ట్రాఫిక్ ఆంక్షలకు సహకరించాలని ఎస్పీ కోరారు. అత్యవసర సేవలు, ప్రజా రవాణా వాహనాలకు మినహాయింపు ఉంటుందన్నారు.

### 'పింఛన్‌దారులు ఈకేవైసీ చేయించుకోవాలి'

**శ్రీకాకుళం పాతబస్టాండ్:** జిల్లాలో ఉన్న అన్ని (12) ఉప ఖజానా కార్యాలయాల ద్వారా పింఛన్ పొందుతున్న వారు వారి పెన్షనర్ సీఎఫ్ఎంఎస్, ఐడీ నంబర్‌తో ఆధార్ నంబర్‌ను ఈకేవైసీ లింక్ చేయించుకోవాలని ఖజానా శాఖ డీడీ రవికుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు 35 శాతం మంది మాత్రమే ఈకేవైసీ నమోదు చేసుకున్నారని తెలిపారు. మిగిలిన వారు కూడా చేయించుకోవాలని సూచించారు. పెన్షన్ పొందుతున్న ఉప ఖజానా కార్యాలయాలకు వెళ్లి ఈనెల 6వ తేదీ లోపుగా లింక్ చేయించుకోవాలని తెలిపారు. ఆధార్ కార్డు, ఆధార్‌కు లింక్ చేసిన ఫోన్, సీఎఫ్ఎంఎస్ ఐడీ, పీపీ కాపీ, బ్యాంక్ పాస్‌బుక్ తీసుకువెళ్లాలని సూచించారు.

### 'రాజీ మార్గంలో కేసులు పరిష్కరించాలి'



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

**శ్రీకాకుళం పాతబస్టాండ్:** రాజీ మార్గంలో కేసులు పరిష్కరించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. ఈనెల 13న జాతీయ లోక్ అదాలత్ ఉందని, అందులో ఎక్కువ కేసులు పరిష్కరించాలని తెలిపారు. ఆయన మంగళవారం జిల్లా కోర్టులో పోలీస్, ఎక్సైజ్ అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో సమావేశం నిర్వహించారు. మే 13న జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ సంఖ్యలో క్రిమినల్ కేసులు రాజీ చేసేందుకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసి నాయుడు, జిల్లా జ్యూడీషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ శారదాంబ, ఎక్సైజ్ మెజిస్ట్రేట్ భరణి జిల్లా ఎడిషన్ ఎస్పీ విఠలేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

## దేశంలోనే అత్యుత్తమ సీఎం వైఎస్ జగన్

- స్పీకర్ తమ్మినేని సీతారాం



గుత్తావల్లిలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

**బూర్జ:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన నాటి నుంచి రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని గుత్తావల్లి గ్రామంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా పరిపాలన సాగిస్తున్న సీఎం జగన్ నిజమైన లీడర్ అని, గడప వద్దకే మంచి పాలన తీసుకువచ్చి దేశంలోనే అత్యుత్తమ సీఎంగా చరిత్ర సృష్టించారన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువ చేయడానికి సచివాలయ, వంలంటీర్ వ్యవస్థ ఉందనే విశ్వాసాన్ని ప్రజల్లో నింపా రని పేర్కొన్నారు. సచివాలయ సిబ్బంది నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటించి అభివృద్ధి, సంక్షేమ పథకా లు ప్రజలకు వివరించాలన్నారు. గ్రామంలో జల్‌జీవన్ మిషన్ ద్వారా ఇంటింటి కుళాయిల ఏర్పాటుకు రూ.1.16 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. వైఎస్సార్‌సీపీ మండల ప్రత్యేక ఆహ్వానితుడు కర్నేన నాగేశ్వరరావు, పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు ఖండాపు గోవిందరావు, వైస్ ఎంపీపీలు బుడుమూరు సూర్యారావు, కరణం కృష్ణమూర్తినాయుడు, డీసీఎంఎస్ డైరెక్టర్ జల్లు బలరాంనాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు బగాది నారాయణ మూర్తి, మండల ప్రధాన కార్యదర్శి ఇసాయి వెంకట్రావు, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## పథకాలు ఆగితే పునరుద్ధరించండి

- మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు



తాళ్లభద్రలో ప్రజల సమస్యలు వింటున్న మంత్రి సీదిరి అప్పలరాజు

**కాశీబుగ్గ:** పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో మంగళవారం ఉదయం, సాయంత్రం రెండు పర్యాయాలు గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. 5వ వార్డు తాళ్లభద్ర సచివాలయం పరిధిలో లక్ష్మీనగర్‌కాలనీ, తాళ్లభద్ర కాలనీలో ఘనంగా గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. మంత్రి సీదిరి అప్పలరాజు కార్యక్రమంలో పాల్గొని ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. సాంకేతిక కారణాల వల్ల సంక్షేమ పథకాలు ఆగిపోతే వారిని గుర్తించి సమస్యలను పరిష్కరించి పునరుద్ధరించాలని సూచించారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్ జగన్‌నే మళ్లీ సీఎం చేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ మీసాల సురేష్‌బాబు, బోర కృష్ణరావు, పట్టణ అధ్యక్షులు సనపల సింహాచలం, మున్సిపల్ మాజీ చైర్మన్ కోత పూర్ణచంద్రరావు, హాస్పిటల్ అభివృద్ధి కమిటీ చైర్మన్ భవానీ శంకర్, జిల్లా వాణిజ్య విభాగ అధ్యక్షుడు, కౌన్సిలర్ బెల్లాల శ్రీనివాస్, యువజన నాయకులు హరిప్రసాద్, స్పోక్స్ పర్సన్ గుజ్జు జోగారావు, వార్డు ప్రెసిడెంట్ కంచు నీలకంఠం, మహిళా శక్తి కన్వీనర్ జ్యోతి, బూత్ కన్వీనర్ నర్సిపురం నారాయణరావు, క్లస్టర్ ఇన్‌చార్జులు డబ్బీరు సురేష్, శ్రీనాథ్, లక్ష్మణ్, అశోక్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిపక్షాలకు సంక్షేమం పట్టదు

- మంత్రి ధర్మాన ప్రసాదరావు



మాట్లాడుతున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

**అరసవల్లి:** ప్రభుత్వం విద్య, వైద్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని కానీ ఆ పనులు ప్రతిపక్షాలకు కనిపించడం లేదని, కానీ ప్రజలు మాత్రం ప్రభుత్వం చేస్తున్న పనులను అభినందిస్తున్నారని రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. స్థానిక బాపూజీ కళామందిరంలో మంగళవారం నిర్వహించిన డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (అర్బన్ హెల్త్ సెంటర్లు) అభివృద్ధి కమిటీల చైర్మన్ల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ బి.మీనాక్షి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి ధర్మాన మాట్లాడుతూ గతంలో ఎన్నడూ చూడని సుపరిపాలన నేడు అందుతోందని, అణగారిన వర్గాల్లో జీవన ప్రమాణాలు పెంచడమే అభివృద్ధి అని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో ఆస్పత్రులు, వైద్యకేంద్రాల నిర్వహణ ఎంత దారుణంగా ఉండేదో ప్రజలందరికీ తెలుసని, ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదన్నారు. అంతకుముందు నగరంలోని ఆరు అర్బన్ హెల్త్ సెంటర్లకు చైర్మన్లుగా మొదలవలస రాజేంద్రకుమార్ (డీసీసీబీ కాలనీ), కె.రాజగోపాల్ (ఆదివారంపేట), ముద్దాడ అప్పలనాయుడు (అరసవల్లి), డి.పి దేవ్ (కాకి వీధి), కిల్లంశెట్టి వెంకటప్పారావు (పుణ్యపువీధి), డి.వెంకట సత్యారామరాజు (ఫాజుల్‌బాగ్‌పేట)లు బాధ్యతలు స్వీకరిస్తూ ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం మంత్రి ధర్మాన మాట్లాడుతూ ఇప్పటికే వైద్య రంగంలో అద్భుత మార్పులకు శ్రీకారం చుట్టారని, ఇటీవలే ఫ్యామిలీ డాక్టర్ విధానంతో క్షేత్ర స్థాయిలో ఇంటికే ప్రభుత్వ వైద్య సేవలు అందుతున్నాయని గుర్తుచేశారు. వైద్యాధికారులు, సిబ్బంది మరింత బాధ్యతతో పనిచేయాలని సూచించారు.

చైర్మన్లు ఈ పదవులు అజమాయిషీ కోసం కాదన్న సంగతిని గుర్తుపెట్టుకోవాలని చెప్పారు. అనంతరం నగరానికి చెందిన 10 మంది దివ్యాంగులకు ఒక్కొక్కటి రూ.1.20 లక్షల విలువైన ట్రైమోటార్ సైకిళ్లను మంత్రి అందజేశారు. ఈ వారంలో జిల్లా వ్యాప్తంగా 80 మందికి ఇలాంటి వాహనాలను పంపిణీ చేయనున్నట్లుగా ప్రకటించారు.

## అమ్మ పండుగ.. గుండె నిండుగా



కిన్నెరవాడలో సిరిమానోత్సవం

గూడెంలో కాళికా వేషధారణ

ఒక గ్రామానికి 14 ఏళ్ల తర్వాత సిరిమాను వస్తే.. మరో గ్రామంలో 13 ఏళ్ల తర్వాత అమ్మవారి సంబరం జరిగింది. ఇన్నేళ్ల తర్వాత ఊరికి ఉత్సవం రావడంతో సారవకోట మండలం కిన్నెరవాడ, శ్రీకాకుళం పరిధి గూడెం గ్రామాలు సంబర పడ్డాయి. జనమంతా బంధు గణాన్ని పిలుచుకుని పండగ చేసుకున్నారు. సిరిమానును మహిళలు పది వేల చీరలతో అలంకరించగా.. అసిరితల్లి సంబరంలో అపురూప వేషధారణలతో అదరగొట్టారు.

– సారవకోట, శ్రీకాకుళం రూరల్

## క్లుప్తంగా

### ఎస్పీని కలిసిన డీఎస్పీ


ఎస్పీ రాధికకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీఎస్పీ శృతి

**శ్రీకాకుళం క్రైమ్ :** శ్రీకాకుళం సబ్ డివిజన్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ అధికారిగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన వై.శృతి మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ జి.ఆర్.రాధికను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం డివిజన్ పరిధిలోని శాంతిభద్రతలు తదితర అంశాలపై ఎస్పీతో చర్చించారు.

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


దేవరాజు(ఫైల్)

**టెక్కలి రూరల్:** టెక్కలి డీఎల్‌పీఓ కార్యాలయ ఆఫీస్ సబార్డినేట్ గొడ దేవరాజ్(43) మంగళవారం మృతిచెందారు. మెళియాపుట్టి పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గత నెల 30న మెళియాపుట్టి మండలం పూలసార గ్రామానికి వెళ్లిన దేవరాజ్.. అక్కడి నుంచి జాడుపల్లి వైపు ద్విచక్ర వాహనంపై వస్తుండగా కుక్క అడ్డు రావడంతో బండి అదుపు తప్పి బోల్తాపడ్డారు. తీవ్రగాయాలు కావడంతో శ్రీకాకుళంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందారు. కాగా, దేవరాజును గుర్తు తెలియని వాహనం ఢీకొనడం వల్లే ఈ ప్రమాదం జరిగి ఉంటుందని స్థానికులు అనుమానిస్తున్నారు. ఈయనకు భార్య రున్నూ, పిల్లలు గాయత్రి, కిరణ్ ఉన్నారు.

### నీలమణిదుర్గకు వెండి కిరీటం బహూకరణ


కిరీటం అందజేస్తున్న దాతలు

**పాతపట్నం:** ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం పాతపట్నం నీలమణిదుర్గ అమ్మవారికి సారవకోట మండలం మాళువ గ్రామానికి చెందిన సిరిపురం అప్పలనాయుడు కుమారులు నరసరావు, దిలీప్‌లు వెండి కిరీటాన్ని మంగళవారం బహూకరించారు. ఈ కిరీటం విలువ సుమారు రూ.లక్ష ఉంటుందని దాతలు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఈవో వాసుదేవరావు, కమిటీ సభ్యులు కృష్ణారావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

### ఎంపీడీఓతో ఫీల్డ్ అసిస్టెంట్ల వాగ్వాదం


ఎంపీడీఓ ఉమాసుందరితో వాగ్వాదానికి దిగిన ఎఫ్‌ఏలు

**సంతబొమ్మాళి:** 'మా మీద ఎందుకు ఇష్యూ చేస్తున్నారు.. కావాలనే ఇరికించాలని చూస్తున్నారు..' అంటూ ఎంపీడీఓ, ఏపీఓ, ఈసీలపై ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లు బి.రామారావు, నీలాపు ప్రసాద్‌రెడ్డి వాగ్వాదానికి దిగారు. 'ఒక్క రోజు పనిచేయకుండా..' అనే కథనం సాక్షిలో మంగళవారం ప్రచురితం కావడంతో నౌపడ సచివాలయానికి ఎంపీడీవో ఉమాసుందరి, ఏపీఓ వాసునాయుడు విచారణ నిమిత్తం వచ్చారు. ఈ సందర్భంగా ఎఫ్‌ఏలు మాట్లాడుతూ ఇలాంటి ఉద్యోగం చేసుకొని ప్రతి ఒక్కరినీ ప్రాధేయపడాల్సిన అవసరం లేదన్నారు. దీంతో అక్కడ ఉన్న సచివాలయ సిబ్బంది ఎఫ్‌ఏలను బతిమలాడడంతో విచారణకు సహకరించారు. నెలకు రూ.12 వేలు జీతం తీసుకొని ఉపాధి పని చేస్తున్నట్లు మస్టర్లు ఎలా వేసుకుంటున్నావని ఎఫ్‌ఏ ప్రసాద్‌రెడ్డిని ఎంపీడీఓ ప్రశ్నించారు. మీకు డబ్బులే కావాలని.. ఉద్యోగం అంటే భయం లేదని మండిపడ్డారు. అనంతరం లిఖితపూర్వకంగా లేఖ తీసుకున్నారు. విచారణ నివేదికను కలెక్టర్‌కు అందజేసి తదుపరి చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

### బులియన్

| విశాఖపట్నం | |
|---|---|
| బంగారం(24సి. 10గ్రా.) | 60,930-00 |
| బంగారం(22సి. 10గ్రా.) | 55,850-00 |
| వెండి (కిలో) | 80,400-00 |

### కోడిగుడ్ల ధరలు

| హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు) | |
|---|---|
| విశాఖపట్నం | రూ. 450.00 |
| విజయనగరం | రూ. 454.00 |
| శ్రీకాకుళం | రూ. 454.00 |

### చికెన్

| బ్రాయిలర్ | | |
|---|---|---|
| లైవ్ | డ్రెస్డ్ | స్కిన్‌లెస్ |
| ₹135 | ₹225 | ₹ 245 |

# పీజీ ప్రవేశాలకు ఆహ్వానం

- ప్రారంభమైన దరఖాస్తుల స్వీకరణ
- అందుబాటులో 1206 సీట్లు

| | |
|---|---|
| ఏపీ పీజీ సెట్-2023 నోటిఫికేషన్ | మార్చి 28 |
| దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం | ఏప్రిల్, 1 |
| దరఖాస్తుల స్వీకరణ చివరి తేదీ | మే 11 |
| రూ.500 అదనపు రుసుంతో చివరి తేదీ | మే 21 |
| రూ.1000 అదనపు రుసుంతో చివరి తేదీ | మే 26 |
| ఆన్‌లైన్ దరఖాస్తుల్లో తప్పులు సరిదిద్దుకునేందుకు | మే 27, 28 |
| హాల్ టికెట్ డౌన్‌లోడ్ | జూన్ 1 నుంచి |
| ప్రవేశ పరీక్ష నిర్వహణ | జూన్ 6 నుంచి 10 వరకు |
| పరీక్షల సమయం | ఉదయం 9.30 నుంచి 11 గంటలు |
| | మధ్యాహ్నం 1 గంట నుంచి 2.30 గంటలు |
| | మధ్యాహ్నం 4.30 నుంచి 6 గంటలు |
| ఫలితాలు | కీ విడుదల, అభ్యంతరాల స్వీకరణ, అనంతరం ఫలితాలు |


డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం

**ఎచ్చెర్ల క్యాంపస్:** పోస్టు గ్రాడ్యుయేషన్ ప్రవేశాలకు వేళయ్యింది. రాష్ట్రంలోని 15 విశ్వవిద్యాలయాలు, అనుబంధ కళాశాలల్లో పీజీ ప్రవేశాలకు ఆంధ్రప్రదేశ్ పోస్టు గ్రాడ్యుయేషన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్-2023 నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది ఆంధ్రా విశ్వవిద్యాలయం ప్రవేశ పరీక్ష నిర్వహిస్తుంది. జిల్లాలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం, అఫిలియేషన్ పరిధిలోని ఏడు పీజీ కళాశాలల్లో పీజీ సీట్లను సైతం ఏపీ పీజీ సెట్ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో 16 కోర్సుల్లో 556 సీట్లు ఉం డగా, అఫిలియేషన్ కళాశాలల్లో 650 సీట్లు ఉన్నాయి. జిల్లా వర్సిటీకి అనుబంధంగా శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీ కళాశాల, శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, గాయత్రీ పీజీ కళాశాల, ఆదిత్య, ఎస్ఎస్ఆర్, సన్, రంగముద్రి కళాశాలల్లో పీజీ కోర్సులు అందిస్తున్నాయి.

**అంబేడ్కర్ వర్సిటీలో...**

వర్సిటీలో 16 కోర్సులు ఉండగా, రెగ్యులర్, సెల్ఫ్ ఫైనాన్స్ విధానాల్లో కోర్సులు నిర్వహిస్తున్నారు. ఎకనామిక్స్‌లో 40, రూరల్ డెవలప్‌మెంట్‌లో 40, ఎంకాంలో 40, ఎంఎల్ఐఎస్సీలో 40, ఎంఈడీలో 40, ఇంగ్లీషులో 40, సోషల్ వర్కులో 40, తెలుగులో 40, ఎంజేఎంసీలో 30, ఆర్గానిక్ కెమిస్ట్రీలో 30, మైక్రోబయాలజీలో 22, ఎనలాటికల్ కెమిస్ట్రీలో 22, గణితంలో 40, బయోటెక్నాలజీలో 30, ఫిజిక్స్‌లో 40, అప్లైడ్ మ్యాథ్స్‌లో 22 సీట్లు అందుబాటులో ఉన్నాయి.

- ఏడు అఫిలియేషన్ పీజీ కళాశాల్లో జువాలజీ, ఎంఈడీ, కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్, ఎంకాం, కెమిస్ట్రీ, ఎనలాటికల్ కెమిస్ట్రీ కోర్సులో ఉన్నాయి. విశ్వవిద్యాలయం, ప్రభుత్వ కళాశాలల్లో పోస్టు గ్రాడ్యుయేషన్ చదివే విద్యార్థులకు మాత్రమే జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన వంటి ప్రభుత్వ రాయితీలు, ప్రయోజనాలు వర్తిస్తాయి.


పీజీ క్లాస్ వర్కులో విద్యార్థులు

### ప్రమాణాలతో కూడిన విద్య



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో ప్రమాణాలతో కూడిన విద్య అందిస్తున్నాం. నాక్ గుర్తింపు సైతం విశ్వవిద్యాలయానికి ఉంది. ఉన్నత విద్యా మండలి రాష్ట్రం యూనిట్‌గా అకడమిక్ క్యాలెండర్ రూపొందిస్తుంది. ప్రస్తుత ఉద్యోగ ఉపాధి అవకాశాలను అనుగుణంగా సిలబస్‌ల్లో మార్పులు, ఇంటర్న్‌షిప్‌లు, పారిశ్రామిక అనుసంధానాలు వంటి వాటికి ప్రాధాన్యమిస్తున్నాం. పోటీ పరీక్షల పుస్తకాలు గ్రంథాలయంలో అందుబాటులో ఉంచుతున్నాం.

– ప్రొఫెసర్ సీహెచ్‌ఏ రాజేంద్రప్రసాద్, రిజిస్ట్రార్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వ విద్యాలయం

### సద్వినియోగం చేసుకోవాలి



జిల్లా విద్యార్థులు విశ్వవిద్యాలయంలో ఉన్నత విద్యను సద్వినియోగం చేసుకోవాలి. డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులు పీజీ విద్యకు ప్రాధాన్యమివ్వాలి. వర్సిటీ ప్రస్తుతం16 పీజీ కోర్సులు నిర్వహిస్తున్నాం. అన్ని కోర్సులకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ నిబంధనలు మేరకు అర్హులైన బోధకులు ఉన్నారు. జిల్లాలో డిగ్రీ తరువాత పీజీకి ఎక్కువ మంది విద్యార్థులు ప్రాధాన్యమిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని విశ్వవిద్యాలయాలకు ఒకే సెట్ వల్ల విద్యార్థులు తమకు నచ్చిన కోర్సులో ర్యాంకు బట్టి చేరవచ్చు.

– ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య, ప్రిన్సిపాల్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం

## నాక్ గుర్తింపే లక్ష్యం


అధికారులతో సమావేశమైన నిపుణుల కమిటీ

**ఎచ్చెర్ల క్యాంపస్:** నేషనల్ ఎసస్‌మెంట్ అండ్ అక్రిడేషన్ కౌన్సిల్ (నాక్) గుర్తింపు లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ట్రిపుల్ ఐటీ) ఓఎస్‌డీ ప్రొఫెసర్ ఎల్.సుధాకర్‌బాబు అన్నారు. ఎస్ఎం పురం ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌ను ఆర్‌జీయూకేటీ అధికారులు నియమించిన అంతర్గత కమిటీ సభ్యులు మంగళవారం సందర్శించారు. నాక్‌కు కావల్సిన అర్హతలు, ప్రస్తుతం ఉన్న సౌకర్యాలు, ఏర్పాటు చేయాల్సిన సదుపాయాలపై స్థానిక అధికారులతో చర్చించారు. నిపుణుల కమిటీలో గీతం పూర్వపు వీసీ ప్రొఫెసర్ హరినారాయణ, నాగార్జున విశ్వవిద్యాలయం పూర్వపు వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కె.వియన్నరావు, ఐఎస్‌సీ బెంగళూరు విశ్రాంత ప్రొఫెసర్ మోహన్‌రావు ఉన్నారు. నాక్ డాక్యుమెంటేషన్ పూర్తి చేయగా త్వరలో బృందం భౌతికంగా విశ్వవిద్యాలయాన్ని సందర్శించనుంది. ఆర్‌జీయూకేటీ పరిధిలోని ఇడుపులపాయ, నూజివీడు, శ్రీకాకుళం, ప్రకాశం క్యాంపస్‌లు యూనిట్‌గా వెళుతున్నారు. నాక్ కమిటీ పరిశీలన అంశాలకు సంబంధించి పూర్తిస్థాయి ఏర్పాట్లు చేస్తున్నారు. కార్యక్రమంలో పరిపాలన అధికారి ముని రామకృష్ణ, అకడమిక్ డీన్ కొర్ల మోహన్‌కృష్ణ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

## జియోలజీ విభాగం బోధకుల తొలగింపు

**ఎచ్చెర్ల క్యాంపస్:** డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో జియోలజీలో మూడేళ్లగా ప్రవేశాలు లేవు. పీజీ ప్రవేశాలు సైతం నిలిపివేశారు. అయినా ఇన్నాళ్లూ బోధకులను కొనసాగిస్తూ వచ్చారు. చివరికి ఉన్నత విద్యాశాఖ అధికారుల మార్గదర్శకాలకు అనుగుణంగా కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న నలుగురు బోధకులు జయరాజ్, పద్మిని, స్వాతి, సూర్యనారాయణలను తొలగిస్తూ గత నెల 29న నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి నోటీసులు తీసుకోవాలని సమాచారం ఇచ్చారు. 2009లో జియోటెక్ అనే మూడేళ్ల కోర్సు ప్రారంభించారు. అనుకున్న స్థాయిలో కోర్సు విజయవంతం కాకపోవటంతో జియోలజీ, జియోఫిజిక్స్ కోర్సులు ప్రారంభించారు. ఈ రెండు కోర్సుల్లో సైతం గత కొన్నేళ్ల నుంచి ప్రవేశాలు లేవు.గతంలో సతీష్‌చంద్ర ఉన్నత విద్యాశాఖ ప్రత్యేక కమిషనర్‌గా ఉన్నప్పుడు ఈ విభాగం పూర్తిగా నిలిపివేసి బోధకులను తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు. పాలక మండలిలో ప్రస్తావించిన అధికారులు భవిష్యత్తులో జియోలజీతో పీజీ డిప్లమా కోర్సులు నిర్వహించి బోధకులను కొనసాగించాలని నిర్ణయించారు. తాజాగా డిప్లమా కోర్సులకోసం విభాగం అవసరం లేదని స్పష్టం చేశారు. ఉన్నత విద్యాశాఖ అధికారుల ఆదేశాల మేరకు నలుగురు బోధకులను తొలగించినట్లు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సీహెచ్‌ఏ రాజేంద్రప్రసాద్ మంగళవారం చెప్పారు.

## బైక్ ఢీకొని తాపీమేస్త్రి మృతి


పలాస సామాజిక ఆరోగ్య కేంద్రంలో వెంకటరావు మృతదేహం

**కాశీబుగ్గ:** అతివేగంగా వచ్చి వాహనాన్ని ఢీకొట్టిన ఘటనలో మేస్త్రి మృతి చెందిన ఘటన వజ్రపుకొత్తూరు మండలం బెండి గ్రామం వద్ద మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. వజ్రపుకొత్తూరు పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. వజ్రపుకొత్తూరు మండలం సీతాపురం గ్రామానికి చెందిన కూసుమురు వెంకటరావు (51) తాపీమేస్త్రీగా పనిచేస్తున్నాడు. మంగళవారం రాత్రి 7.30 గంటల సమయంలో సహచరుడు గొల్లపల్లి ధర్మారావుతో కలిసి ద్విచక్ర వాహనంపై వస్తుండగా బెండి పొలిమేరల్లో ఉన్న పాతపట్నం ఆలయ సమీపం వద్దకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న బెండి గ్రామానికి చెందిర హనుమంతు కృష్ణగుప్తా మద్యం మత్తులో ద్విచక్ర వాహనంపై అతి వేగంగా వచ్చి ఢీకొట్టాడు. ఈ ఘటనలో బైకు వెనుక కూర్చున్న వెంకటరావు తలకు తీవ్ర గాయాలు కావడంతో అపస్మారక స్థితికి చేరుకున్నాడు. వెంటనే 108 అంబులెన్సులో పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించినా ఫలితం లేకపోయింది. మృతుడికి భార్య పార్వతి, వివాహితులైన కుమార్తెలు శ్రవంతి, రమ్య ఉన్నారు. వజ్రపుకొత్తూరు ఎస్ఐ మధు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**రైలు కింద పడి యువకుడి మృతి**

**కోటబొమ్మాళి:** సారవకోట మండల కేంద్రానికి చెందిన నౌపడ చిన్నారావు కుమారుడు నౌపడ రవికుమార్ (29) మంగళవారం రైలు కింద పడి మృతి చెందాడు. తిలారు రైల్వేస్టేషన్ రైల్వేగేట్ సమీపంలో మధ్యాహ్నం 2.30 సమయంలో బెంగళూరు-భువనేశ్వర్ స్పెషల్ ట్రైన్ రవికుమార్‌ను ఢీకొట్టింది. మృతికి గల కారణాలు తెలియలేదు. రవికుమార్ ప్రస్తుతం పాన్‌షాప్ నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మృతుడి సెల్‌ఫోన్ ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పలాస రైల్వే ఎస్ఐ షరీఫ్ తెలిపారు.

## తెప్పలకు ఆదర్శ స్వర్ణ నంది పురస్కారం


అవార్డు అందుకుంటున్న తెప్పల కృష్ణమూర్తి

**కాశీబుగ్గ:**

పలాసకు చెందిన జనజాగృతి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ తెప్పల కృష్ణమూర్తికి ఆదర్శ స్వర్ణ నంది అవార్డు దక్కింది. హైదరాబాద్‌లోని చిక్కడపల్లి త్యాగరాయ గానసభ వేదికపై ఆదర్శ కళానిలయం ఆధ్వర్యంలో జరిగిన ఆదర్శ ఐరావతం, ఆదర్శ స్వర్ణ నంది జాతీయ అవార్డుల ప్రదానోత్సవం కార్యక్రమంలో ఈ అవార్డు అందుకున్నారు. రచయితగా, నటుడిగా, లయన్స్ సభ్యునిగా సమాజ సేవకునిగా, విద్యావేత్తగా వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తున్నందుకు గాను ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు కృష్ణమూర్తి మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా వివిధ అనుబంధ సేవా సంస్థల అధ్యక్షులు అప్పారావు, వెంకటాచలం, చిన్నచారి, రుద్రమూర్తి, ఉత్తరావల్లి నాగేశ్వరరావు తదితరులు కృష్ణమూర్తికి అభినందించారు.

### 6న పౌరాణిక ప్రదర్శనలు

**శ్రీకాకుళం కల్చరల్:** స్థానిక బాపూజీ కళామందిర్‌లో ఈ నెల 6న శ్రీకాకుళ రంగస్థల కళాకారుల నెలవారీ సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో పలు పౌరాణిక ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. రామాంజనేయం(యుద్ధం సీను), కురుక్షేత్రం(పాండవ సీను), గయోపాఖ్యానం (యుద్ధం సీను), సత్యహరిశ్చంద్ర (వారణాసి సీను) ప్రదర్శనలు జరుగుతాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ పౌరాణిక కళాకారిణి కె.వి.పద్మావతికి 'నట గాయ మంజరి' బిరుదు, బి.ఎ.ఎ.మోహనరావు, మిత్రుల సహకారంతో 'రజిత మకుటం' బహూకరించనున్నట్లు తెలిపారు.

### 'న్యాయమే గెలిచింది'

**శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ):** 2016 జనవరి 31న జరిగిన కాపు ఐక్యగర్జన సందర్భంగా దహనమైన రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ కుట్ర కేసులో కాపులను బలిపశువులను చేస్తూ అనేక సెక్షన్ల కింద నమోదైన కేసులను న్యాయస్థానం కొట్టివేయడం పట్ల శ్రీకాకుళం జిల్లాలో తెలగ కులస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ కాపునాడు ఉపాధ్యక్షుడు ద్వారపు అజిత్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే కాపు, తెలగ, బలిజ, ఒంటరి కులాలకు న్యాయం జరుగుతోందని తెలగ సంఘం నాయకులు పిల్లల రామకృష్ణారావు, సిద్దా జగదీష్ కుదిరెల్ల అప్పారావు, నంది సూర్య ప్రకాష్, కొండా రామారావు, డబ్బూరి దివాకర్, ఎం.రాంబాబు, దేవిరెడ్డి వీరబాబు, రొక్కం వేంకటేశ్వరరావు తదితరులు పేర్కొన్నారు.

## ఎయిమ్స్ నర్సింగ్ ఆఫీసర్ పరీక్షలకు శిక్షణ

**శ్రీకాకుళం రూరల్:** మండలంలోని రాగోలు జెమ్స్ ఆస్పత్రి, బొల్లినేని మెడిస్కిల్స్‌లో ఎయిమ్స్-నర్సింగ్ ఆఫీసర్స్ పరీక్షలకు శిక్షణ ఇవ్వనున్నట్లు బొల్లినేని మెడిస్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మే 1 నుంచి శిక్షణ ప్రారంభించినట్లు పేర్కొన్నారు. బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎం కోర్సులు పూర్తి చేసిన వారు అర్హులని తెలిపారు. ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణులైన విద్యార్థులకు బీఎస్సీ పారామెడికల్, బీఎస్సీ నర్సింగ్, బీపీటీ, ఎంఎల్‌టీ, జీఎన్ఎం, డిప్లమా పారామెడికల్ కోర్సుల్లో అడ్మిషన్లు జరుగుతున్నాయని వివరించారు. పూర్తి వివరాలకు 7680945357, 7995013422 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

## కొత్తూరులో సైబర్‌మోసం

**కొత్తూరు:** మండలం కేంద్రం కొత్తూరుకు చెందిన సారిపల్లి హరికృష్ణ సైబర్ మోసానికి గురై రూ.1,94,000 నష్టపోయాడు. ఈయన సెల్‌ఫోన్‌కు గత నెల 27న ఓ వాట్సాప్ మెసేజ్ వచ్చింది. పార్ట్‌టైం జాబ్ కావాలంటే అందులో సూచించిన టెలీగ్రామ్ లింక్‌ను క్లిక్ చేయాలని చెప్పారు. మొదటి టాస్క్‌లో రూ.2000 చెల్లించగా ఖాతాకు రూ.2800 జమ చేశారు. తర్వాత మూడు టాస్క్‌లలో డబ్బులు చెల్లించినా తిరిగి జమ చేయకపోవడంతో నష్టపోయినట్లు బాధితుడు గుర్తించాడు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## కాంగ్రెస్ పార్టీకి మాజీ ఎమ్మెల్సీ గుడ్ బై


మాట్లాడుతున్న పీరుకట్ల విశ్వప్రసాదరావు

**బూర్జ:** మండలంలోని తోటవాడ పంచాయతీ టీఆర్ రాజుపేట గ్రామానికి చెందిన పీరుకట్ల విశ్వప్రసాదరావు కాంగ్రెస్ పార్టీకి, తన సభ్యత్వానికి రాజీనామా చేసినట్లు తెలియజేశారు. విశ్వప్రసాదరావు మంగళవారం తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర విభజన తర్వాత కాంగ్రెస్ పార్టీకి మనుగడ లేకుండా పోవడంతో ప్రజాభిప్రాయం మేరకు రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. గతంలో తాను ఎమ్మెల్సీగా పీసీసీ వైస్ ప్రెసిడెంట్‌గా పనిచేశానని తెలిపారు. ఆయనతోపాటు కుటుంబ సభ్యులు మండల మాజీ వైస్ ఎంపీపీ పీరుకట్ల విశ్వప్రభాకరరావు, రాష్ట్ర ఓబీసీ కాంగ్రెస్ పార్టీ కో కన్వీనర్ పీరుకట్ల సీతారాంనాయుడు, మాజీ సర్పంచ్ ఎంపీటీసీ మామిడి వెంకటసూర్యం కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేశారు. ఏ పార్టీలో చేరాలనేది ప్రజా అభిప్రాయం మేరకు త్వరలో నిర్ణయం తీసుకుంటామన్నారు.

# ఆర్ట్ బై కల్కి!

- చిత్రాలకు జీవం పోస్తున్న కల్కి ప్రసాద్
- ప్రముఖ దేవాలయాల్లో చిత్రాల ఏర్పాటు


ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చిత్రాన్ని గీస్తున్న కల్కి ప్రసాద్


రాష్ట్రపతి అబ్దుల్ కలాంకు చిత్రాన్ని అందిస్తున్న కల్కి(ఫైల్)

**సారవకోట:** మండల కేంద్రం సారవకోటలోని కొత్తపేట వీధిలో నివాసముంటున్న కోరాడ కల్కిప్రసాద్ అద్భుతమైన చిత్రాలు గీసి అబ్బురపరుస్తున్నారు. విశాఖపట్నానికి చెందిన ఈయన 12 ఏళ్లుగా సారవకోటలోనే ఉంటున్నారు. ఈయన గీచిన చిత్రాల్లో జీవం ఉట్టిపడుతుంటుంది. ఈయన చిత్రకళను గుర్తించిన ఎన్ఆర్ఐలు కల్కి ప్రసాద్‌ను తమ దేశాలకు తీసుకెళ్లి అక్కడి ఆలయాల్లో దేవతా మూర్తుల చిత్రాలను గీయిస్తున్నారు. ఇప్పటికే అమెరికా, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా, ఇరాక్, శ్రీలంక, సౌతాఫ్రికా, వెస్టిండీస్ దేశాలకు వెళ్లి మన దేవతా మూర్తుల చిత్రాలను జీవం ఉట్టిపడేలా గీశారు. రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాలైన తిరుపతి, శ్రీకాళహస్తి, సింహాచలం, భద్రాచలం, శ్రీకూర్మంలలోనూ ఈయన గీచిన చిత్రాలు దర్శనమిస్తాయి. మాజీ ప్రధానులు అటల్‌బిహారీ వాజ్‌పేయి, మన్మోహన్ సింగ్‌ల చిత్రాలను గీచి వారికి బహుమతిగా అందజేశారు. ప్రస్తుత ప్రధాని నరేంద్ర మోదీ తల్లి చిత్రాన్ని గీచి ఆయనకు ఢిల్లీలో బహూకరించారు. మహానేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడులకు సైతం మహాత్ముని చిత్రపటాలను బహూకరించి మన్ననలు అందుకున్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, తండ్రి రాజశేఖరరెడ్డిలతో కలిసి ఉన్న చిత్రాన్ని అద్భుతంగా గీసి బహూకరించారు. అయితే కల్కి ప్రసాద్‌కు కొన్నేళ్లుగా ఆరోగ్యం సహకరించకపోవడంతో ఇతర ప్రాంతాలకు వెళ్లలేక స్థానికంగానే ఉంటున్నారు.

**రాష్ట్రపతి అవార్డుతో సత్కారం**

కల్కి ఆర్ట్స్‌గా గుర్తింపు పొందిన ఈయన ప్రతిభను గుర్తించి అబ్దుల్ కలాం రాష్ట్రపతిగా ఉన్న సమయంలో ఆయన చేతుల మీదుగా రాష్ట్రపతి అవార్డు పొందారు. దీంతో దేశంలో ఎక్కడకైనా ఫ్లైట్లో ఉచితంగా వెళ్తుంటారు.

### చిన్నప్పటి నుంచే మక్కువ..



5వ తరగతి చదువుతున్నప్పటి నుంచి చిత్రాలు గీయడం ఆసక్తి. తల్లిదండ్రులు ప్రోత్సహించడంతో అనేక చిత్రాలను గీశాను. ఎన్ఆర్ఐలు వారి దేశాలకు తీసుకెళ్లి దేవతామూర్తుల చిత్రాలను గీయించారు. ప్రస్తుతం ఆరోగ్య పరిస్థితి బాగాలేక ఇతర ప్రాంతాలకు వెళ్లలేకపోతున్నాను.

– కోరాడ కల్కి ప్రసాద్, ఆర్టిస్టు, సారవకోట


సాక్షి క్లాసిఫైడ్స్

PLOT FOR SALE

■ గ్రేటర్ విశాఖలో 5 లక్షలకే 116 గజాలు ఇంటి స్థలం 150, 200 గజాలు, 24 బిట్లు గలవు. గాజువాకకి 15 కి.మీ.లో స్పాట్ రిజిస్ట్రేషన్, EMI కలదు. ఫోన్: 73864 14017 [V-794456]

HEALTH CARE

■ మనోధైర్యాన్ని కల్పించబడును. కుటుంబ సమస్యలు, వ్యసనాలు, ఋణ బాధలు, చెప్పుకోలేని అనారోగ్య సమస్యలకు అతి ఆలోచనలతో నిద్ర పట్టని వారికి స్ఫూర్తి కౌన్సిలింగ్ సెంటర్‌లో కౌనిలింగ్ ఇస్తూ చక్కని పరిష్కార మార్గాన్ని చూపబడును. సెల్: 7893266255 [S-771004]

WANTED

■ Agent Recruitment SBI LIFE INSURANCE Opp: M.R.O. Office, Main Road, Narasannapeta. Qualification: 10th. Contact: 9014530090 [S-771002]

■ శ్రీకాకుళం టౌన్ లాడ్జిలో పనిచేయుటకు రిసెప్షనిస్ట్, రూమ్‌బోయ్స్ మరియు బట్టలు షాపులో పనిచేయుటకు సేల్స్‌మెన్స్, హెల్పర్స్ (బోయ్స్/గర్ల్స్) కావలెను. (లోకల్ వారికి మాత్రమే). సెల్: 9440710617 [S-756398]

■ ప్రముఖ కంపెనీ నందు మీ ఇంటి వద్దనే ఉండి పార్ట్ టైమ్/ఫుల్‌టైమ్ పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలయును. జీతం : 15000 + ఇన్సెంటివ్స్. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 8341371684 [G-786210]

■ మా కంపెనీ LED బల్బులు మీ ఇంటివద్దనే ఉండి ఫిట్‌చేసి ఇవ్వడం ద్వారా నెలకి 15,000- 20,000/- వరకు సంపాదించండి. వివరాలకై సంప్ర: 9346032628 [G-786216]

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా రోజుకు 50 మెసేజీలు పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. మీ అడ్రస్ వాట్సాప్ చేయండి. వివరాలకు కాల్ చేయండి. 99596 17233, 9154527823. [M-1190684]

■ ప్రకాశం జిల్లా, ఒంగోలులో నారాయణ రియల్ ఎస్టేట్ నందు మార్కెటింగ్ స్టాఫ్ M/F కావలెను. Q: 10th - MBA. జీతం + కమీషన్, భోజనం + ఫ్రీ రూమ్‌కలదు. ✆ 63046 42825, 77807 51944 [O-787138]

■ డైరెక్ట్ జాబ్ 18-50 సం॥ల మహిళలు మాకంపెనీ కొరకు వెంటనే కావలెను. ఉచిత వసతి+ భోజనం, జీ॥ 16-30వేల వరకు. స్పాట్ జాయినింగ్. ఫోన్ : 8886733005 / 008 [HA-10830]

■ VIP's ఇంట్లో పేషెంట్‌ని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు అర్జెంటుగా కావలెను. ఆయా, వార్డ్ బాయ్స్, నర్సులు, వంటవారు, RMP, Dr., Q: 5th - డిగ్రీ. 10-30 వేలు జీతం, భో+రూం ఫ్రీ, Hyd. Ph: 7995984445 [HA-114]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 18K. ఏజెంట్ కమీషన్ 3K. ఫోన్: 9848571888 [H-793419]

■ సెక్యూరిటీ గార్డ్స్ : వైజాగ్‌లో గల పవర్ ప్లాంట్‌లో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ వెంటనే కావలెను. 8గం॥ డ్యూటీ, 26రో॥. జీతం : 10000/-+ PF + ESI. ఉచిత వసతి, భోజనం. ఫోన్: 99896 17278 [V-10520]

■ విశాఖపట్నంలో ప్రముఖ ఓల్డేజ్ హోమ్‌కి వృద్ధులకు సేవ చేయుటకు 24 గంటలు ఆడ/మగ & వంట మనిషి (స్త్రీ) కావలెను. ఉచిత భోజనం & వసతి ఇవ్వబడును. ఫోన్: 99899 93756 [V-772]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.